ప్రేమ రహస్యం:

# పర్సనాలిటీ ★

రచన: "జీవ"

వాసవదత్త. "స్వప్నవాసవదత్త"లోని వత్సరాజు భార్య కాదు.

ఈమె వేశ్య. పట్టణం అదే ఉజ్జయిని.

ఒక్క ఉజ్జయినిలోనే కాదు. ఆమె ప్రచండ విఖ్యాతి — సౌందర్యానికి — దేశాంతరాలు కూడా పట్టడంలా.

ఆమె ప్రాప్తిస్తేచాలు జన్మ తరించి పోతుందనుకునే వాళ్లే సన్యాసులు మొదలుకొని చాకలివాళ్లదాకా.

ఒకనాడు తన మేడ డాబామీద తల ఆరబోసుకుంటోంది స్నానం చేసి.

అదే సమయం వీధిలో వెడుతున్నాడు. యవ్వనం గడ్డకట్టి నడుస్తోందనిపించింది వాసవదత్తకి చూస్తే. వాడొక బౌద్ధ సన్యాసి, ఉపాదత్తుడు బుద్ధుడి శిష్యుడు.

చెలికత్తెను పంపించి పిలిపించింది, వచ్చాడు.

"ఏం ?......"

"స్వామీ, మీ అనుగ్రహంకోరి ఆహ్వానించాను. మీకంటె నాకు తగిన..."

"—ఉపాదత్తుడు వాసవదత్త వద్దకు రావలసిన సమయం ఇంకా రాలేదు."

—అంటూ వెళ్ళిపోయినాడు.

వాసవదత్తను ఉంచుకున్న వాడొక కోటీశ్వరుడు, రత్నాల వర్తకుడు.

"వాడి యాజమాన్యంలో ఉన్నంతవరకూ ఉపాదత్తుడు నిన్నెట్లా స్వీకరిస్తాడు?" అని అర్థమేమో ఉపాదత్తు డన్న మాటలకు ?

వాసవదత్త కేమీ తోచలా. కొన్నాళ్ళకు విధి చిత్రం. వాసవదత్త మీదికి కొక కేసు వచ్చింది, రత్నాలు దొంగలించిందని మరణదండన విధించారు.

ఆ రోజుల్లో మరణదండన అంటే ఉరితియ్యడం కాదు. కాళ్లూ చేతులూ నరికి మొండేన్ని పాతిపెట్టడం.

నెత్తురు మడుగు. పక్క గొయ్యి, చెలికత్తె. కొన ఊపిరి. "అమ్మా, ఏమిటి నీ ఆఖరు కోరిక. నాకు చేతనైతే తీర్చి నిన్ను శాంతంగా మరణింపజేసి, ధన్యురాలౌతాను?" అని చెలి ఏడుస్తూ అడిగింది.

"ఉపాదత్తుణ్ణి చూడాలి!"

అదే సమయానికి ఉపాదత్తుడు వగుర్చుకుంటూ పరుగెత్తుకొని వస్తున్నాడు. చెలికత్తె చూసి చెప్పింది". 'అదుగో ఉపాదత్తుడు నీకోసమే పరుగెత్తుకు వస్తున్నాడు' అని.

వాసవదత్త మరణదండన వార్త వినగానే ఆమెకోసం వెతుక్కుంటూ పరుగెత్తుకొని వస్తున్నాడు.

వస్తే, అంతా నెత్తురుమయం. బట్టలేని మొండెం, పై ఉత్తరీయం విసిరేస్తే చెలికత్తె కప్పింది.

ఉపాదత్త దర్శనానికి వాసవదత్త మనస్సు ఆనందించి శాంతించింది.

ఉపాదత్తుడు బౌద్ధతత్వరహస్యాలు తియ్యని మాటల్లో బోధించాడు. ఆమె మరింత ఆనందించి శాంతించింది.

ఆమెకు కావలిసింది బిగువైన ఉపాదత్త శరీరమైతే శాంతి బదులు ఆశాభంగమే కలిగేది.

## ఆనందవాణి

★

రచయితలు చాలామంది తాము పంపించే రచనలు ప్రకటింపబడతాయో లేదో తెలియక చాలా తహతహపడుతూ వుంటారు.

మీ రచనలతోబాటు పోస్టుబిళ్ళలు కూడా పంపిస్తే సాధ్యమైనంతత్వరలో, ప్రకటించేదీ లేనిదీ తెలియబరుస్తూ, ప్రకటించడానికి వీలులేనియెడల సదరు రచనలు త్రిప్పి పంపబడును.

ఆనందవాణికి ఏజంట్లు, చందాదార్లు మొదలయినవారు పంపించే మనియార్డర్లు వ్యక్తుల పేరగాకుండా "మేనేజరు, ఆనందవాణి, నెం. 12, తంబుచెట్టి వీధి, మద్రాసు" అని వ్రాసి పంపవలెను.